కథానిక

# కమలమ్మ

బి. అనూరాధ

కమలమ్మను తల్చుకున్నప్పుడల్లా నాకు నవ్వు వస్తుంది; జాలీ వేస్తుంది. ఆమె చేసే పనులూ, అనే మాటలూ, చెప్పే ఊహలూ చిత్రంగా వుంటాయి. "కమలమ్మా!" అని పిలిచేసరికి దొప్పచెవులు ఆడించుకుంటూ చక్కా వచ్చేది.

కమలమ్మకి తనను చూస్తే తనకే గొప్ప. తన చెవులు చాలా పెద్దవనీ, తను ఎర్రగా, పొడవుగా వుంటాననీ, తన పెదవులు పారిజాతపుపువ్వు కాడ రంగుగా వుంటాయనీ, తన పాదాలు లేత తమల పాకులనీ, తన జుట్టులో వుంగరాలు వున్నాయనీ, తన అందం అతిలోకమైనదనీ కమలమ్మ సగర్వంగా చెపుతూ వుండేది. తన వెడల్పుఅయిన మెత్తని చెవులే తన సౌందర్యానికి చక్కని తార్కాణమని ఆమె నమ్మకం. మనం కనురెప్పలను కదిపినంత సులువుగా కమలమ్మ తన చెవిదొప్పలను మెదిలించగలదు.

కమలమ్మని చిన్నప్పుడుకూడా "కమలమ్మా" అనే పిలిచేవారు. చిన్నపిల్లకదా అని ఎవరైనా "కమలా" అని పిలిస్తే వూరుకునేది కాదు. "కమలమ్మా" అని నోరారా పిలిస్తేనే ఆమెకి సరదా: "కమలమ్మా" అనే పిలుపులో ఎంతో గౌరవం యిమిడి వుందిట.

కమలమ్మని నేను చిన్నప్పటినించీ బాగా ఎరుగుదును. కమలమ్మ యింటికీ మా యింటికీ మధ్య గోడ అడ్డం. మా యిళ్లకు సమీపంలోనే ఒక శివాలయం, ఆలయానికి చుట్టూ సువర్ణ గన్నేరుచెట్లూ, దాని కెదురుగా ఒక కోనేరు వున్నాయి.

కమలమ్మకి ఎంత విపరీతమైన చెవులు ఉన్నాయో ఆమెకు ఈశ్వరుడిమీద అంత విపరీతమైన భక్తి. కమలమ్మకి సువర్ణ గన్నేరు మొక్కలంటే ఎంతో యిష్టం. కమలమ్మ ప్రొద్దుటే లేచి శివాలయంలోకి వెళ్లేది. ముందుగా కోనేరులో స్నానం చేసి, ఆ తడిబట్టలతోనే వాళ్ల నాయనమ్మ ఇచ్చిన ఇత్తడి పువ్వుల సజ్జనిండా సువర్ణ గన్నేరుపువ్వులు కోసుకుని, నల్లని నంది నెత్తిమీద రెండు పువ్వులు వేసి, దేవుని దర్శనం చేసుకుని, పూజించి, పూజారి యిచ్చిన ప్రసాదం పుచ్చుకుని వచ్చేది. శివుని సాన్నిధ్యంలో ఏవో అవ్యక్త మధురంగా పాటలు కూడా పాడేది కమలమ్మ. ఆపాటల లోని భావాలు అందరికీ అర్థమవడం కష్టం. కమలమ్మ రోజూ ఆలయంనుంచి తెచ్చే ప్రసాదం సువర్ణ గన్నేరు పువ్వులే. ఆ పువ్వులే కళ్లకు అద్దుకొని, బుద్ధ విగ్రహం చెవులవంటి తన ఇంతపాటి పెద్ద చెవులకి పెట్టుకునేది. కమలమ్మ జడ చాలా పెద్దదే అయినా ఆమె తలలో గన్నేరు పువ్వులను తురుముకోవడం నే నెన్నడూ చూడలేదు. పువ్వులను తలలోకంటె చెవులలో పెట్టుకోవడమే ఆమెకు చాల యిష్టం.

కమలమ్మకి నాలుగవ యేట తల్లీ, తండ్రీకూడా చనిపోయారు. అప్పటినించీ కమలమ్మ వాళ్ల ముసిలి నాయనమ్మదగ్గర పెరుగుతోంది. నాయనమ్మ పేదరాలు కూడాను. నాయనమ్మ, "నాచిట్టితల్లికి ఎలాంటి మొగుడు వస్తాడో కాని, దీని వళ్లంతా బంగారంమయం చేసేవాడు దొరుకుతేబాగుండును" అంటూవుండేది.

కమలమ్మకి మాత్రం నాణ్యమైన బట్టలన్నా నగలన్నా ఎంతమాత్రం ఇష్టం వుండేదికాదు. ఎప్పుడూ ఒళ్లంతా సువర్ణగన్నేరు పువ్వులతో అలంకరించుకునేది. చెవులకు వున్న సువర్ణగన్నేరు పువ్వులను చూచుకుంటూ, "నాకు నగలుపెట్టే మొగుడూవొద్దు, పెళ్లీవొద్దు; నీదగ్గరనే వుండిపోతాను, నాయనమ్మా" అనేది. "పెళ్లి చేసుకుంటే వాడు నామెడకు వురివేస్తాడు; నా అందమైన చెవులకు రాళ్లు కడతాడు" అని భయపడేది.

ఊహవచ్చినప్పటినించీ కూడా కమలమ్మ రవిక తొడుగుకుని, చీరకట్టేది. కమలమ్మకి పదమూడు ఏళ్లు వెళ్లి పద్నాలుగోయేడు రాబోతోంది. వాళ్ల నాయనమ్మ చాలాతొందర పడుతోంది, కమలమ్మకి పెళ్లి చెయ్యాలని. ఒకసారి నాయనమ్మ నాతో,

“ఇంత అమాయకపుపిల్ల ఎలా బ్రతుకుతుందే: పెళ్లి చేసుకోనని మారాం చేస్తుంది. ముసలిముండని నేనింక ఎన్నాళ్లు వుంటాను. రేపు ప్రొద్దున్న నేను హరీమంటే దీన్ని ఎవరు చూస్తారు? నువ్వయినా కాస్త చెప్పు, తల్లీ” అని చెప్పుకుని వాపోయింది. మాసిపోయిన కళ్లు ఒత్తుకుని, ఎర్రబడిన ముక్కు తుడుచుకుంది.

కాని, కమలమ్మకి పెళ్లి అంటే సుతరామూ ఇష్టంలేదు. ఒకనాడు కమలమ్మ నా దగ్గరకి వచ్చి రహస్యంగా, “మా నాయనమ్మ నన్ను పెళ్లి చేసుకోమని పోరుతోంది, అక్కా. నాకుమాత్రం ఏమీ యిష్టంలేదు. ఆ పెళ్లిచేసుకున్నవాడు కోపం వచ్చినప్పుడు, నా మెత్తని చెవులను మెలివేస్తాడు. అప్పుడు ఇవి ఎర్రగా కందిపోవు, అక్కా? అదీ కాక, నా చెవులనీ, నా శరీరాన్నీ, నా మనస్సునీ ఆ పరమశివునికి అర్పించివేశాను: నువ్వు చూడ లేదుకాని నేను రోజూ ప్రొద్దుట, సాయంత్రం శివుని పాదాలు నా చేతులతో కడిగి, చీర చెంగుతో తడివొత్తి, గన్నేరుపువ్వులతో అర్చిస్తాను. తరవాత ,ఆయనని నిద్రపొమ్మని వింజామరలవంటి నా పెద్దచెవులతో విసురుతాను. ఆయన యిచ్చిన పువ్వులప్రసాదం కళ్లకు అద్దుకుని నా చెవులలో పెట్టుకుంటాను. వారు నా పిచ్చిచేష్టలన్నింటిని చూసి ఒక్కొక్కసారి నవ్వుతుంటున్నట్టు కనిపిస్తుంది. కాని, ఇంతవరకు వారు ఒక్కసారికూడా నాతో మాట్లాడలేదు. ఎప్పుడు దయవస్తుందో మరి. పారిజాతపుపువ్వులాగ ఆయన వొడిలో వుండిపోవాలని, పాములా ఆయనమెడకు చుట్టవేసుకోవాలని, పార్వతిలాగ ఆయన శరీరంలో సగమైపోవాలని వుంటుంది, అక్కా, నాకు. వారికి అర్పించిన ఈ హృదయాన్ని ఇతరులకు ఎలా ఇవ్వగలను, అక్కా, నువ్వే చెప్పు” అని కంటనీరు పెట్టుకుంది.

అప్పుడప్పుడు నేనుకూడా నా చిన్న కూజా బింది పట్టుకుని కమలమ్మతో కోనేటికి స్నానానికి వెళ్లి వచ్చేటప్పుడు కోనేటి ఒడ్డున వున్న బావి నించి నీళ్లు తీసుకువచ్చేదాన్ని. ఒకసారి నేనూ, కమలమ్మా కోనేటిలో స్నానంచేస్తున్నాము. కమలమ్మ ఏదో తనలో తనే పైకి వినపడకుండా చదువుతోంది. “ఏమిటే, కమలమ్మా, జపం చేస్తున్నావు?” అన్నాను. కమలమ్మ అప్పుడే మెరుగు పెట్టిన బంగారంలాగ చిరునవ్వు నవ్వుతూ, “కోనేటి మంత్రం అక్కా” అంది. “కోనేటి మంత్రం ఏమిటి? నాకుకూడా చెప్పు” అన్నాను నేను. “పైకి చెపితే నవ్వుతావేమో, అక్కా” అంది, అమాయికంగా కమలమ్మ. “అబ్బె, నవ్వనులే, పైకి చదువు” అన్నాను. కమలమ్మ ఇలా చదివింది:

“కోనేటూ, కోనేటు !
ఇక్కడా, అక్కడా ఈశ్వరుడె !
ఆయనపైనే నా మనసు :
ములిగిస్తే ములిగించు,
తేలిస్తే తేలించు !”

కమలమ్మ అమాయికత్వానికి నాకు నిజంగా నవ్వు వచ్చిందిగాని, పైకి నవ్వితే చిన్నపుచ్చుకుంటుందని నవ్వలేదు.

ఎవరైనా తనను చూడడానికి వస్తే వాళ్ల చెవులలో కూడా రెండు సువర్ణ గన్నేరు పువ్వులు పెడుతూ ఉంటుంది కమలమ్మ. ఎవరైనా “కమలమ్మా” అని పిలిచేటప్పటికి తన అందమైన చెవులని వెనకకి, ముందుకీ కదుపుతూ చిరునవ్వుతో, సిగ్గుతో ఎదురుగావచ్చి నుంచుంటుంది కమలమ్మ. ఫలానాఆవిడ కమలమ్మా అని ఎవరినైనా చూపిస్తే ఆమెకు కూడా పెద్ద చెవులు వున్నాయేమో అని ఆతురతతో చూస్తుంది కమలమ్మ. తనకిలాగే దొప్ప చెవులు వుంటే ఆమె తన శివుణ్ణి అపహరిస్తుందేమో అని భయం కమలమ్మకి.

కమలమ్మకి శివుడిమీద ఎంతభక్తో పూజారిని చూస్తే అంతకోపం: తన యిష్టంవచ్చినప్పుడు శివుడిని దర్శించడానికి వీలులేకుండా పూజారి శివాలయానికి తాళం వేస్తాడుట.

ఒకనాడు కమలమ్మ చాలా సంతోషంగావుంది. “ఎందుకే చెవలమ్మా, అంత సంతోషంగా వున్నావు?” అని అడిగాను.

“అదేమిటే, అక్కా, ‘కమలమ్మా’ అను, ‘చెవలమ్మా’అంటేనాచెవలనివెక్కిరించినట్టుకాదూ? నన్ను కావలిస్తే ఏమైనా అను గాని, నా చెవులని మాత్రం ఏమీ అనకు, అక్కా” అంది కమలమ్మ బిక్కమొహంతో.

అయ్యో, ఎందుకు అలా అన్నానా అని నొచ్చుకుని, “ఇంకెప్పుడూ అనను లే,కమలమ్మా,క్షమించు” అన్నాను.

అప్పుడు మళ్లీ సంతోషంతో కమలమ్మ

మొహం ఇంత చేసుకుని ఆప్యాయంగా తన చెవులను మునివేళ్లతో సవరించుకుంటూ, నన్ను జేర్లాపడి కూర్చుంది.

“కమలమ్మా, ఏమిటి కబుర్లు” అన్నాను. కమలమ్మ నా మొహంకేసి అదోకలాగ చూసి, చెప్పనా, అక్కా, ఎవరికీ చెప్పవుకద?” అంది.

“చెప్పనులే, చెప్పు” అన్నాను.

“అక్కా, నిన్నరాత్రి ఏమైందనుకున్నావు: శివుడు వచ్చి నా చెవులను తన చేతితో తడిమినట్టు అయింది, అక్కా; అప్పుడు నన్ను నేను మరచిపోయాను” అంది కమలమ్మ, ఏదో పొంగివస్తున్న ఆనందాన్ని తట్టుకోడానికి ప్రయత్నిస్తూ.

అసలు కమలమ్మకి తన ఆలోచనలు, తన పద్ధతులూ, తన చూపులే వేరు. ఒకరోజు రెండు సువర్ణ గన్నేరుపువ్వులు పట్టుకువచ్చి “ఈపువ్వులు నీదగ్గర వుంచు, అక్కా: నీకు మంచిదవుతుంది” అంది కమలమ్మ.

“అవునుగాని, కమలమ్మా, నువ్వు పెళ్లి ఎప్పుడు చేసుకుంటావు?” అన్నాను.

“అబ్బ, ఆమాట అడగకు, అక్కా” అంది కమలమ్మ తన చెవులు రెండూ వూగిస్తూ.

కమలమ్మని చూస్తే ఆమె ఎందుకు ఇలా తయారయిందా అని ఆశ్చర్యంవేస్తుంది: తనకు ఏమి తక్కువని కమలమ్మ పెళ్లి వద్దంటుంది?

నేను అత్తవారి యింటినించి పండగకి మా పుట్టింటికి వచ్చాను. రాగానే కమలమ్మని చూడాలని కబురంపించాను; ఆమె కనబడలేదు. సాయంకాలం కోనేటి గట్టుమీది బావికి మంచినీళ్లు తేవడానికి వెళ్లాను. కమలమ్మ ఒక సువర్ణ గన్నేరు చెట్టుక్రింద కూర్చుని వెక్కి వెక్కిపడి ఏడుస్తోంది. ఇంతకుముందు కమలమ్మ అలా ఏడవడం నేనెన్నడూ చూడలేదు. నన్ను చూసి చెయ్యి వూపింది తనదగ్గరకి రమ్మని. నేను బిందె బావిదగ్గర పెట్టి చప్పున ఆమెదగ్గరకి వెళ్లాను.

కమలమ్మ నన్నుగట్టిగా కౌగిలించుకొని మరింత బిగ్గరగా ఏడ్చింది. నాకెంతో జాలివేసింది.

“ఏమిటి ఇలా అయిపోయావు కమలమ్మా?” అని అడిగాను.

కమలమ్మ ముంచుకువస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ తనకి ఈలోకమంటే ఇష్టంలేదని, ఎక్కడికో ఆకాశంలోకి వెళ్ళిపోవాలని వుందనీ, ఆ మేఘాలతో సమానంగా పక్షుల రెక్కలలాగ తన చెవులు ఆడిస్తూ విహరించాలని కోరికగా వుందని, వాళ్ల నాయనమ్మ పదిరోజుల క్రిందట అక్కడికి వెళ్ళిపోయిందని, ఆకాశంలో కనపడే తెల్లని మేఘాలు పండిపోయిన వాళ్ల నాయనమ్మ జుట్టే అనీ, తనుకూడా అక్కడికి వెళ్లిపోతాననీ, శివుణ్ణి కూడా తనతో రమ్మని ప్రార్థిస్తాననీ, ఆయన తప్పకుండా వస్తాడని తనకి నమ్మకం ఉందనీ, సువర్ణ గన్నేరు చెట్లని కూడా తీసుకువెళ్లి ఆకాశంలో నాటుతాననీ, అక్కడ సువర్ణ గన్నేరు చెట్టుక్రింద పరమ శివుణ్ణి తన ఒడిలో పెట్టుకుని, ఆయనను సువర్ణగన్నేరు పువ్వులతో అర్చిస్తూ సువర్ణగన్నేరు పువ్వుల విగ్రహంలాగ కూర్చుంటాననీ, త్వరలోనే ఆ ముహూర్తం రాబోతున్నదనీ, ఇంకా ఏమిటేమిటో చెప్పేసి రివ్వున శివాలయంలోకి వెళ్లి మాయమైపోయింది.

అంతే; నాటికీ, నేటికీ నేను కమలమ్మని మళ్లీ చూడలేదు. అప్పుడప్పుడు శివాలయంలో కమలమ్మ శివుణ్ణిగురించి పాడుతున్న పాటలుమాత్రం ఇంకా వినిపిస్తాయని పూజారి చెపుతూ వుంటాడు. అంతేగాని, కమలమ్మ మళ్లీ ఎవరికీ కనబడలేదు. కమలమ్మ ఏమైపోయిందో ఎవరికీ తెలియదు. ఆమెను తల్చుకున్నప్పుడల్లా నాకు జాలి వేస్తుంది.

ఒక యిల్లాలు కొత్తగా వచ్చిన పనిమనిషిని యిదివరకెక్కడెక్కడ పనిచేసిందో వాకబు చేస్తోంది. “అయితే యిక్కడమాత్రం స్థిరంగా ఉండేదానివా నువ్వు? చాలా యిళ్లుచూసినట్టున్నావు,” అని కొంతసేపటికామె ప్రశ్న వేసింది. ఆ పిల్ల ‘ఓ’ అన్నట్టుగా చిరునవ్వు నవ్వింది: “ఉంటానమ్మా! ఏ యిల్లూ నాలంతట నేను వొదులుకు పోలేదు” అని జవాబు చెప్పింది.